

చౌడలమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను నమ్మించి మోసం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో చౌడలమ్మ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఆనాడు రంగానాయకసాగర్ ద్వారా కాళేశ్వరం నీళ్లతో పుల్లూరు బండ నర్సింహా స్వామి పాదాలు కడుగుతా అని మాట ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం బండ కింద నుండే కాలువ పారుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని, కేసీఆర్ ఉన్నప్పుడు రూ.200 పెన్షన్‌ను రూ.2వేలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4వేల పెన్షన్ చేస్తామన్నారని, రూ.4వేలు దేవుడెరుగు, రెండు నెలల పెన్షన్ ఎగ్గొట్టారని ఆరోపించారు. మహిళలకు రూ.2500 ఇస్తామన్నారు.. తులం బంగారమని చెప్పారు అన్ని ఉట్టి మాటలే అయ్యాయన్నారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ సరిగ్గా చేయలేదు కానీ ఆగం ఆగం.. సగం సగం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం జల్లాలతో నేడు రెండు పంటలు పండుతున్నాయని, రంగనాయక సాగర్ ద్వారా సిద్దిపేటలో ఎండాకాలం కూడా చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయంటే కాళేశ్వరం జలాలు సాక్ష్యమన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ఆలయానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ లత వెంకట్, యాదవ సంఘం నాయకులు ఉడుత కనకయ్య, మల్లయ్య, యాదయ్య, రాములు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు.. తెలంగాణకు దగ్గరివాడు

చిన్నకోడూరు : చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లిలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ అందరివాడే కానీ తెలంగాణకు మరింత దగ్గరివాడని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోల్‌మాల్‌పై అధికారుల విచారణ!

- సుమారు 250 బస్తాల మేర పక్కదోవ పట్టించినట్లు ప్రాథమిక నిర్ధారణ
- రికవరీకి చర్యలు?

చేర్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహకులు తూకంలో మోసానికి పాల్పడి రైతులను దగా చేసిన విషయమై సోమవారం ఐకేపీ, తూనికల కొలతలశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ప్రవీణ్, సెర్ప్ ఏపీడీ మధుసూదన్, డీపీఎం కరుణాకర్, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఒక్కో రైతు ఎన్ని బస్తాల ధాన్యం విక్రయించారు. ట్రక్ షీట్‌లో ఎంత నమోదు చేశారు. రైతుల ఖాతాలో ఎన్ని డబ్బులు జమయ్యాయి. అదనంగా నమోదు చేసిన ధాన్యం బస్తాల డబ్బులు ఏం చేశారని ఆరా తీశారు. ప్రాథమికంగా 225 ధాన్యం బస్తాలు అదనంగా నమోదు చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మరింత లోతైన విచారణ చేస్తే ధాన్యం పక్కదోవపై పూర్తిస్పష్టత రానుంది. విచారణ నిమిత్తం కొనుగోలుకేంద్రానికి రావాలని నిర్వహకురాలు వందనకు సూచించగా తాను అనారోగ్యానికి గురై సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలపడం చర్చనీయాంశంగా మారింది.

అక్రమంగా ధాన్యం కొల్లగొట్టిన విషయం తేటతెల్లకావడంతో రైతులు తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు. అకాల వర్షాలతో ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు తూకంలోనూ మోసం చేసారని వాపోతున్నారు. కొనుగోలుకేంద్రం నిర్వహణ బాధ్యతల నుంచి వీవో అధ్యక్షురాలు వందనను తొలిగించినట్లు అధికారులు తెలిపారు. రికవరీకోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



ట్రక్ షీట్‌ల ఆధారంగా వివరాలను సేకరిస్తున్న అధికారులు

ఎడగారు వరి నాట్లు షురూ..

అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎడగారు(ఎరగళ్లు)వరి నాట్లు మొదలయ్యాయి. ఒకప్పుడు సాగునీరు తక్కువగా ఉండడంతో రైతులు తక్కువ మొత్తంలో ఎడగారు (వానాకాలం, యాసంగికి మధ్యలో) సాగు చేసేవారు. ప్రస్తుతం బోర్లు, వ్యవసాయబావుల్లో నీరు బాగుడడంతో దొడ్డు రకం వరి సాగు చేస్తున్నారు. ఎడగారులో దొడ్డు రకం(1010) వరి పంటను సాగు చేస్తే చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే శక్తి ఉంటుందని, దిగుబడి కూడా అధికంగా వస్తుందని, అలాగే ఎడగారులో సాగుచేసిన పంటకు డిమాండ్ ఉంటుందని, ధర కూడా ఎక్కువగా పలుకుతుందని చెబుతున్నారు.

– అక్కన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి)





గజ్వేల్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులు

ఇంటింటికీ అమృత్ 2.0

ప్రతీ ఇంటికి శుద్ధజలం అందించేందుకు కేంద్రం అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్‌మేషన్) పథకానికి శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా ప్రతీ ఇంటికి నీటి కుళాయి కనెక్షన్ ఉండేలా సన్నాహాలు చేస్తున్నది. అందుకు సిద్దిపేట జిల్లాలో కోటి లీటర్లకు పైగా సామర్థ్యం గల నీటి ట్యాంకులను నిర్మించి వాటి ద్వారా తాగునీటిని అందించేందుకు కసరత్తు చేపట్టింది. అందుకు జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు సిద్దిపేట, గజ్వేల్, చేర్యాలను ఎంపిక చేసింది. వీటిలో దాదాపు రూ.129కోట్ల మేర నిధులు వెచ్చించి 263.035 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేయడంతో పాటు 11 నీటిట్యాంకులను నిర్మించనున్నారు. ఈ ట్యాంకుల నిర్మాణం పూర్తయితే ప్రజలు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి.

– సిద్ది పేట ఆంధ్రజ్యోతి, మే 25



చేర్యాలలోని అంబేడ్కర్‌నగర్‌లో ప్రారంభమైన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

- 24/7 కుళాయి ద్వారా నీరు అందించేందుకు సన్నాహాలు
- జిల్లాలో 3 మున్సిపాలిటీలు ఎంపిక
- 11 వాటర్ ట్యాంకుల నిర్మాణం
- ఇప్పటికే గజ్వేల్, చేర్యాలలో ప్రారంభమైన పనులు
- త్వరలోనే సిద్దిపేట పట్టణంలో పనులకు శ్రీకారం
- మూడు మున్సిపాలిటీల్లో 263.035 కిలోమీటర్ల పైప్‌లైన్లు
- రూ. 129 కోట్లు కేటాయించనున్న కేంద్రం
- పైలెట్ ప్రాజెక్టు కింద సిద్దిపేటలో ఓ వార్డు ఎంపికకు కసరత్తు

జిల్లాలో అమృత్ 2.0లో భాగంగా తాగు నీటి వసతులు కల్పించేందుకు గజ్వేల్, చేర్యాలలో పనులను అధికారులు ప్రారంభించారు. సిద్దిపేటలో స్థలాల ఎంపిక తుదిదశకు చేరడంతో త్వరలోనే పనులు ప్రారంభించాలని యోచిస్తున్నారు. గజ్వేల్, సంగాపూర్, రాజిరెడ్డిపల్లిలో ట్యాంకుల నిర్మాణం కోసం స్థలాలను ఎంపిక చేసి పనులను ప్రారంభించారు. చేర్యాలలో అంబేడ్కర్‌నగర్‌తో పాటు పలు స్థలాలను ఎంపిక చేశారు. అంబేడ్కర్‌నగర్‌లో పనులు ప్రారంభం కాగా, చేర్యాలలో మరో రెండు ట్యాంకుల నిర్మాణం కోసం మార్కెట్‌యార్డు, ఆర్టీసీకి చెందిన స్థలాలలో నిర్మించేందుకు తలపెట్టగా ఆ రెండు శాఖలకు నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మరెక్కడైనా నిర్మించాలా వద్దా అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

నిరంతరం నీరందించేలా..

అమృత్ 2.0 పథకంలో భాగంగా సిద్దిపేటలో 24/7 గంటల పాటు నిరంతరాయంగా కుళాయిల ద్వారా తాగునీరందించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఓ వార్డును మున్సిపల్ అధికారులు ఎంపికచేయనున్నారు. ఈ మేరకు పలు వార్డులలో ఎంపిక చేసేందుకు సర్వేను సైతం నిర్వహించగా, త్వరలోనే ఓవార్డును ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. తద్వారా ఆ వార్డులో నీటి కుళాయి కనెక్షన్ లేని గృహాలకు నీటి కనెక్షన్‌ను అందించి, ట్యాంకులు నిర్మాణం కాగానే కుళాయి తిప్పగానే నిరంతరాయంగా తాగునీరందించనున్నారు. సిద్దిపేటలోని 43 వార్డులతో పాటుగా ఇటీవల గత రెండేళ్లకు పైగా పట్టణ శివారుల్లో నూతన గృహాలు

మిగతా 8లో..

సిద్దిపేట, గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు మొత్తంగా 263.035 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేయనున్నారు.

- సిద్దిపేట మున్సిపల్ పరిధిలో రూ.87.50 కోట్ల నిధులతో 198.113 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్ వేయడంతో పాటు 62లక్షల (6200కెఎల్) లీటర్ల సామర్థ్యం గల ఐదు ట్యాంకులు నిర్మించనున్నారు.
- గజ్వేల్‌లో రూ. 28 కోట్లతో 48.712 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ వేయడంతో పాటు 27 లక్షల (2700 కెఎల్) లీటర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకులు కట్టనున్నారు.
- చేర్యాలలో రూ.13.50 కోట్లతో 16.193 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేయడంతో పాటు 20లక్షల (2000 కెఎల్) లీటర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకులు నిర్మించనున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సర్వేయర్ల శిక్షణ మొదలు

- తొలివిడతలో 176 మంది ఎంపిక

సిద్దిపేట కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణను మొదలు పెట్టారు. తొలివిడత శిక్షణకు 176 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారికి భూకొలతల శాఖ ఆధ్వర్యంలో 50 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. తొలిరోజు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 352 మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలివిడతలో 176 మందిని, మలివిడతలో మరో 176 మందికి శిక్షణ ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందించారు.

పరిశీలించిన కలెక్టర్

సర్వేయర్ల శిక్షణను సోమవారం కలెక్టర్ మనుచౌదరి పరిశీలించి మాట్లాడారు. భూభారతి చట్టం అమలు కోసం సర్వేయర్ల సేవల అవసరం అధికంగా ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద సర్వేయర్ల కొరత ఉన్నందున అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి రెండు నెలలు శిక్షణ ఇప్పించి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.

ప్రజావాణికి 73 దరఖాస్తులు

ప్రజావాణిలో భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం 73 ఫిర్యాదులను కలెక్టర్ మనుచౌదరి స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వన మహోత్సవ లక్ష్యం చేరాలి

వన మహోత్సవం కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం జిల్లాలో లక్ష్యంగా పెట్టుకున్న 22.47 లక్షల మొక్కలు నాటడానికి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖలతో 2025 వనమహోత్సవ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, ఇందిరా సౌరగిరి జలవికాసం కార్యక్రమంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.

నాదస్వర బృంద గానం



ఎదుగుతున్న శక్తి.. భారతీయ సంస్కృతి

- వేదాలు, ఉపనిషత్తులతో కూడిన సమ్మేళనం
- దేశ నలుమూలల్లో ఆధ్యాత్మికత ప్రతిధ్వని
- హోజాగిరి ప్రదర్శన గవర్నర్‌గా నాకు గర్వకారణం
- స్పిక్ మైకే కార్యక్రమాల్లో మమేకమ్వండి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ కళా వేడుక


కంది, మే 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సాంస్కృతిక విలువలతో ఎదుగుతున్న శక్తివంతమైన ఉద్యమమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన స్పిక్ మైకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్) సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, అధికారులు, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అంతర్జాతీయ వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మన దేశం వేదాలు, ఉపనిషత్తులతో కూడిన సమ్మేళనమని కొనియాడారు. దేశ నులమూల ఆధ్యాత్మికత ప్రతిధ్వనిస్తుందని పేర్కొన్నారు. స్పిక్ మైకే ఉద్యమం సంస్కృతిని-జాతి ఆత్మను ఒక సామూహిక చైతన్యంగా తీసుకువస్తుందన్నారు. పురాతన ఆలోచనాపరులు, తత్వవేత్తలను

మిగతా 7వ పేజీలో



జ్యోతి ప్రజ్వలన చేసి స్పిక్ మైకే వేడుకను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ





19 ప్యాకెట్ల గంజాయి పట్టివేత

● ఇద్దరు యువకుల అరెస్ట్

రామచంద్రాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను కొల్లూరు పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన మహ్మద్ కరీం(28), మహ్మద్ ఇర్షద్(27)లకు ఆరునెలల క్రితం కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఫేజ్-2లో ఇళ్లు రావడంతో ఇక్కడికి మకాం మార్చారు. వీరికి మహారాష్ట్రలో గంజాయి సరఫరా చేస్తున్న వసీం, అంజద్ పరిచయమయ్యారు. వారి వద్ద నుంచి ప్రతినెలా 42 ప్యాకెట్లు కొని విక్రయిస్తున్నారు. ఒక ప్యాకెట్‌ను రూ.100కు కొని, రూ.500లకు విక్రయిస్తున్నారు. శనివారం మహారాష్ట్రలో 42 ప్యాకెట్లు కొని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన వీరు 20 ప్యాకెట్లను బోరబండలో విక్రయించారు. మిగిలినవి కొల్లూరు డబుల్ బెడ్‌రూంకు తీసుకొచ్చి.. ఆదివారం విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐలు రవీందర్, రమేశ్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. 19 ప్యాకెట్లలో 111 గ్రాముల గంజాయిని నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.







ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. కంది మండలం చిద్రుప్ప, బేగంపేట గ్రామాల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బేగంపేట గ్రామానికి చెందిన జంగారి సాయిగౌడ్ ఫిర్యాదు చేశారు. కంది మండలం జుల్కల్ గ్రామానికి చెందిన శైలజ తనకు సంబంధించిన 0.39 గుంటల భూమిని ధరణిలో మిస్సింగ్‌లో పడిందని, తన భూమి ఇప్పించి న్యాయం చేయాలని ఆర్జీలో కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. భూ భారతిలో సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డిలోని మహిళా సమైఖ్య భవనంలో సోమవారం నిర్వహించిన సర్వేయర్ల శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ దినేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

మెదక్‌లో 52 అర్జీలు

మెదక్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 52 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలు 19, పింఛన్లు 3, డబుల్ బెడ్ రూం ఇళ్లు 1, ఇతర సమస్యలపై 29 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్జీలను ఎప్పటికప్పుడు ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్పీ

మెదక్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీ

● బాధితులకు అప్పగించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవకాలంలో దొంగతనానికి గురైన 35 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని బాధితులకు సోమవారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు చోరీకి గురైన పౌరులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా దొంగతనమైన మొబైల్ ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చని, ఇది ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతిశీల టెక్నాలజీపై ఆధారపడిన ఒక గొప్ప సాధనమని తెలిపారు. సెల్ ఫోన్ల రికవరీలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, పట్టణ సీఐ నాగరాజు, ఎస్‌ఐ అమర్, ఐటీకోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడు మృతి

● వర్గల్ మండలం గౌరారం వద్ద ఘటన


కావమోద్దీన్‌రాయ్ మృతదేహం

వర్గల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం వద్ద సోమవారం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ కీర్తిరాజ్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కావమోద్దీన్ రాయ్(41) అనే కార్మికుడు తన తోటి కార్మికులు మనోజ్ మహతో, మనోజ్‌కుమార్, రాజ్‌కుమార్, రాంబాబు రాయ్‌తో కలిసి గౌరారం గ్రామంలో అద్దెకు ఉంటున్నారు. వీరంతా సూరజ్ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా మార్స్ ఇండియా పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందరూ నిద్రపోయారు. సోమవారం ఉదయం కావమోద్దీన్ రాయ్ నిద్ర నుంచి లేవకపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు వచ్చి మృతిచెందాడని సూరజ్ కన్‌స్ట్రక్షన్ హెచ్‌ఆర్, అడ్మిన్ దాసరి ప్రమోద్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ


సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు

తూప్రాన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఆలయంలోని హుండీలో నగదు చోరీ చేశారు. ఈ విషయమై ఆలయ ఫౌండర్ అమిరిశెట్టి సతీష్‌గుప్తా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన మహ్మద్ జహంగీర్ చోరీకి పాల్పడినట్లు గ్రామస్థులు వివరించారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు అయ్యాయని వివరించారు.



రుక్మాపూర్‌లో మహిళ హత్య


హత్యకు గురైన రాణమ్మ

న్యాల్‌కల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ హత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. హద్నూర్ పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాణెమ్మ(46)ను గుర్తు తెలియని దుండగులు గొంతు నులిమి హత్యచేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, రూరల్ సీఐ జక్కుల హన్మంతులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి
● మరొకరికి గాయాలు
● రామాయంపేట జంక్షన్ వద్ద ఘటన


నిఖిల్(ఫైల్)

రామాయంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందగా.. మరొకిరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రామాయంపేట జంక్షన్ వద్ద సోమవారం చోటు చేసుకున్నది. నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి ప్రాంతానికి చెందిన నిఖిల్(24) తన స్నేహితుడు నితీష్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ రామాయంపేట వైపు క్రాస్ చేస్తూ బైక్‌ను ఢీకొట్టింది. నిఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా.. నితీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలాజీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కుమార్ మృతదేహం

చేగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన ధర్పల్లి కుమార్(54) హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 5న చేగుంట మండలం అనంతసాగర్‌లోని అత్తమామల చూడడానికి వచ్చాడు. అదేరోజు రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఉల్లితిమ్మాయిపల్లి గ్రామ శివారులోని కమాన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. ఆదివారం రాత్రి మృతిచెందాడు. భార్య ధర్పల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

దుబ్బాక, మే 26 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామం వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు పోతరెడ్డిపేట గ్రామంలోని డబుల్ బెడ్‌రూం కాలనీ నుంచి గ్రామంలోకి బైక్‌పై వస్తున్న మణికంఠ, స్వామి, రాజును ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా.. సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

● తప్పిన ప్రమాదం


బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

వర్గల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన సంఘటన వర్గల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో చోటు చేసుకున్నది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్గల్‌లో బ్యాంకు ఆఫ్ బరోడా వద్ద ప్రారంభమైన రోడ్డు నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు వర్షాల కారణంగా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఆర్‌అండ్‌బీ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా కొద్దిపాటి వర్షానికే పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

కొట్టంలో నుంచి గొర్రెలు మాయం

శివ్వంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కొట్టంలోంచి ఐదు గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన సంఘటన సోమవారం శివ్వంపేటలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటలో ఈసుగారి రాజయ్య ఆదివారం రాత్రి గొర్రెల మందను కొట్టంలో తోలి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఐదు గొర్రెలు చోరీ కావడంతో రాజయ్య కొడుకు మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్ తెలిపారు.





సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు (ఫైల్)

కొత్త కోర్సులతో ఉపాధికి ఊతం

సిద్దిపేట డిగ్రీ కళాశాలలో స్పెషల్ కోర్సులు

- ప్రత్యేకత చాటితేనే ఉపాధి అవకాశాలు
- సద్వినియోగం చేసుకోవాలని సూచనలు

సిద్దిపేట కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పోటీ ప్రపంచంలో ప్రత్యేకత చాటితేనే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. విద్యార్థి దశ నుంచే చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే సక్సెస్ అవుతారు. కొత్త అకడమిక్ ఇయర్ మొదలవుతుంది. మా కాలేజీలో చేరండి. ఈ కోర్సు తీసుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు ఆఫర్స్ చేస్తుంటారు. అయితే కోర్సును ఎంపిక చేసుకునే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. పక్కవాళ్లు చెప్పారనో.. స్నేహితుడు సలహా ఇచ్చాడనో ఏదో ఒక కోర్సులో చేరితే ఇబ్బందులు వస్తాయి. అనుకున్నది సాధించలేక వెనకబడిపోతాం. అలా కాకుండా ఆచీతూచి వ్యవహరించి ముందడుగు వేయాలి. అనుభవం కలిగిన వారి సలహాలు తీసుకోవాలి. కళాశాల గురించి పూర్తిగా తెలుసుకోవాలి. కోర్సు పూర్తయ్యాక ఉన్న అవకాశాల గురించి ఆరా తీయాలి. అయితే పాత కోర్సులను కాకుండా కొత్త కోర్సులు, ప్రత్యేకమైన కోర్సులను తీసుకుంటే త్వరగా ఉపాధి అవకాశాలు అందుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

ప్రత్యేక కోర్సులు

ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్లు దోస్త్ ద్వారా పూర్తవుతున్నాయి. విద్యార్థులకు నచ్చిన సబ్జెక్ట్‌ను బకెట్ సిస్టమ్ ద్వారా సెలెక్ట్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు ప్రత్యేకమైన, కొత్త కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2025- 26 విద్యా సంవత్సరానికిగానూ కొత్త కోర్సు అందుబాటులోకి వచ్చింది. బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మేంట్ అనే కోర్సును కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీస్ విభాగం రూపొందించింది. జిల్లాలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో మాత్రమే ఈ కోర్సు అందుబాటులో ఉంది. మూడేళ్ల ఈ కోర్సులో ఫైనల్ ఇయర్‌లో అప్రెంటీస్‌షిప్ విధానం అమలుకానున్నది. విద్యార్థులకు ప్రతినెల భృతి రూపంలో రూ.9 వేలు అందివ్వనున్నారు. ఆస్పత్రి, ఆస్పత్రి అనుబంధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఈ కోర్సు ద్వారా పొందవచ్చని చెబుతున్నారు. అలాగే బీఏ హెచ్‌ఈపీ స్పెషల్ కోర్సును గతేడాది ప్రారంభించారు. డిగ్రీ పూర్తయ్యాక సివిల్స్ చేయాలనే లక్ష్యం ఉన్నవాళ్లకు ఇది మంచి కోర్సు అని నిపుణులు చెబుతున్నారు. సివిల్స్ ప్రిపేర్ కావాలనుకునే వారికి మెటీరియల్‌పరంగా లోతైన విషయ పరిజ్ఞానం పొందవచ్చంటున్నారు. బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సు అందుబాటులో ఉంది. అయితే మూడేళ్ల డిగ్రీ కాదు. ఇంజనీరింగ్, ఫార్మసీ మాదిరిగా కోర్సు వ్యవధి నాలుగేళ్లు ఉంటుంది. ఈ కోర్సు చేసిన వారు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇవే కాకుండా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, పబ్లిక్ పాలసీస్ అండ్ గవర్నెన్స్, బికాం ఫైనాన్స్, బీబీఏ వంటి ప్రత్యేకమైన కోర్సులు ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఫిషరీస్ కోర్సు ప్రత్యేకం. డిగ్రీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు చదివిన వారు మంచి ఉపాధిని పొందుతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు. ఈ ప్రత్యేకమైన కోర్సులు, స్పెషల్ డిగ్రీల భవితవ్యం, ఉపాధి అవకాశాల గురించి వివరాలను తెలుసుకోవడానికి కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. సహాయక కేంద్రాన్ని సందర్శించి మీకు తగిన కోర్సును తీసుకోవాలని కళాశాల అధ్యాపకులు సూచిస్తున్నారు.

మన చదువు ఉపాధినిచ్చేదిగా ఉండాలి



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవం కల్గిన, అర్హత కలిగిన అధ్యాపక బృందం ఉన్నారు. స్వయం ప్రతిపత్తి, ఐఎస్‌వో గుర్తింపు కల్గిన కళాశాల. విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సెలెక్ట్ చేసుకోవాలని సూచిస్తున్నాను. అలాగే కళాశాలలో ప్రత్యేకమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ సంవత్సరం కొత్తగా బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మేంట్ అందుబాటులోకి వచ్చింది. అలాగే ఫిషరీస్ కోర్సు కళాశాల ప్రత్యేకం. ఇలాంటి మరిన్ని ఉపాధినిచ్చే కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి వివరాలు పొందవచ్చు. కోర్సు సెలెక్ట్ చేసుకునేముందు జాగ్రత్తలు తీసుకోవాలి. మనం చదివే చదువు మనకు ఉపాధిని అందించేదిగా ఉండాలి. విద్యార్థుల అభిరుచికి తగినట్టుగా ఎంచుకోవాలి.

డా. జి.సునీత,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



ఐఐటీహెచ్‌లో స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సును హాజరైన కళాకారులు

ఎదుగుతున్న శక్తి.. భారతీయ సంస్కృతి

5వ పేజీ తరువాయి

మన దేశం కలిగిఉండడం గర్వకారణమన్నారు. దేశ నలుమూలల వేదాలు, ఉపనిషత్తుల జ్ఞానం ద్వారా నిర్మితమైన తాత్విక, ఆధ్యాత్మిక పునాదులను ప్రతిఫలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ధర్మం అంటే మనం ఆలోచించే విధానమని, మతం అంటే మనం పూజించే విధానమని గవర్నర్ తెలిపారు. సమకాలీన చర్చలో రెండింటినీ కలపకూడదనే ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పారు. తన స్వస్థలమైన త్రిపుర నుంచి వచ్చిన సంప్రదాయ నృత్య రూపమైన హోజాగిరిని స్పిక్ మైకే 10వ అంతర్జాతీయ ప్రదర్శనలో ఒకటిగా చేర్చడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ గవర్నర్‌గా తన పదవికాలంలో ఇది వ్యక్తిగత గర్వకారణంగా నిలుస్తుందన్నారు. హిందూస్థానీ సంగీతం ఒకప్పుడు త్రిపురలో దాని మహారాజుల పాలనలో వర్ధిల్లిందన్నారు. ఇప్పుడు స్పిక్ మైకే ప్రయత్నాల ద్వారా పునరుజ్జీవనాన్ని పొందుతుందని ఆకాంక్షించారు. ఢిల్లీ, ఖరగ్‌పూర్, నాగ్‌పూర్‌లలో జరిగిన మునుపటి అంతర్జాతీయ సమావేశాలకు గౌరవ అతిథిగా హాజరైన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. స్పిక్ మైకే సదస్సుకు హాజరైన ప్రతీ ఒక్కరూ ఈ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమంలో మమేకమవ్వండని పేర్కొన్నారు.

అలరించిన కళా ప్రదర్శనలు.. ఉట్టిపడిన సంప్రదాయం

పద్మవిభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, పద్మ భూషణ్ డాక్టర్ రాజంతోపాటు 200మంది సంగీత ప్రముఖులు హాజరయ్యారు. తొలుత రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వం వహించిన 'గాంధీ' చిత్రం ప్రదర్శించారు. తర్వాత చలనచిత్ర నిపుణుడితో చర్చ జరిగింది. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీతలు విద్వాన్ షేక్ మహబూబ్ సుభానీ, కలీషాబీ మహబూబ్ నాదస్వర బృంద తమ ప్రదర్శనతో అందరిని మైమరిపించారు. పద్మ భూషణ్ అవార్డు గ్రహీతలు రాజా-రాధారెడ్డి కూచిపూడి నృత్యం అలరించింది. పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డా.ఎన్. రాజం హిందుస్తానీ వయోలిన్ వాయిద్యం కట్టిపడేసింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, పండితులు, సంగీత విద్వాంసులు, ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు, బ్రహ్మ కుమారీస్ సభ్యులు, భారతీయ సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి అలరించారు. దేశ సంస్కృతిని గుర్తుచేసేలా చీరలు, లాల్చి పైజామాలు వేసుకుని కార్యక్రమానికి హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోజ్ పంకజ్‌తో పాటు ప్రముఖ సంగీత విద్వాంసులను చేనేత వస్త్రాలతో సత్కరించి, స్వదేశీ జ్ఞాపికలను అందజేశారు. స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సుతో ఐఐటీహెచ్‌లో వారం రోజులపాటు సందడి నెలకొననున్నది. భరతనాట్యం, కథక్, నాదస్వరం, కూచిపూడి, కర్ణాటక వయోలిన్, హిందుస్తానీ గాత్రం, తబలా, రుద్ర వీణ, కూడియాట్టం, ధృపద్, హిందుస్థానీ వయోలిన్, గోండుల గుస్సాడి నృత్యం, హోజాగిరి నృత్యం, కర్ణాటక వయోలిన్, హిందుస్తానీ గానం, పురూలియా చౌ, హజూరి రాగి-షాబాద్ కీర్తన, పంగ్ చోలోమ్, ఒడిస్సీ, సితార్, సరోద్, ఖవ్వాలి, పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం, బ్రహ్మ కుమారీల ధ్యానం- రాజ్ యోగ, నిజాంకాలంలో కళల జీవనశైలి, సంస్కృతీ, దౌత్యం వంటి వివిధ భారతీయ కళలపై ప్రముఖ సాహితీవేత్తలు, అవార్డు గ్రహీతలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.



రాయపోల్‌లో విత్తనాల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ బాబునాయక్

హాట్ కేకుల్లా 'పచ్చిరొట్ట' విక్రయం

- గంటల్లోనే అయిపోతున్న వైనం
- విత్తనాలు దొరక్క వెనుదిరుగుతున్న రైతులు

రాయపోల్/ములుగు/వర్గల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు పచ్చిరొట్ట విత్తనాలు నెలల తరబడి కూడా అమ్ముడు పోయేవి కావు. రానురాను రైతుల్లో చైతన్యం పెరిగింది. పొలాలను సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు విరివిగా వాడడం మొదలుపెట్టారు. మండలానికి జీలుగా విత్తనాలు 30 కిలోల బ్యాగులు 166, పెద్ద జనుము విత్తనాలు 40 కిలోల బ్యాగులు 50 వచ్చాయి. వాటి విక్రయాన్ని సోమవారం ఉదయం గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బాబునాయక్ ప్రారంభించారు. అప్పటికే రాయపోల్ రైతువేదిక వద్ద వందలాది మంది రైతులు పర్మిట్ల కోసం ఎదురుచూస్తూ ఉండడంతో రెండు గంటల వ్యవధిలోనే మొత్తం పచ్చిరొట్ట విత్తనాలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. విత్తనాలు దొరకని రైతులు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు. ములుగు మండలం వంటిమామిడి గ్రామంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఇందులో ఇన్‌చార్జి ఏవో వసంతరావు, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుత్తాడి శ్రీనివాస్, ఏఈవో పృథ్వీ పాల్గొన్నారు. అలాగే వర్గల్ మండలంలోని అంబర్‌పేట రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శేషశయన జీలుగ విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రైతులు సదానందరెడ్డి, లక్ష్మారెడ్డి, స్వామి, రమేశ్, ఏఈవో భారతి పాల్గొన్నారు.



వర్గల్ మండలం అంబర్‌పేటలో రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఏవో శేషశయన

పచ్చిరొట్ట విత్తనాల కోసం పాస్ పుస్తకాలతో క్యూ

- అధికారులను నిలదీసిన రైతులు



రైతులు క్యూలో ఉంచిన పట్టాదారు పాసుపుస్తకాలు

జోగిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలు(జీలుగ) కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సరిపడా విత్తనాలు రాకపోవడంతో వాటి కోసం వేకువ జాము నుంచే క్యూలో నిలబడుతున్నారు. ఎక్కువ సేపు నిలబడలేక విత్తనాల కోసం తీసుకువచ్చిన పట్టదారుపాస్ పుస్తకాలను క్యూలో పెట్టారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో మంగళవారం ఉదయం చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. జోగిపేట వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 500 క్వింటాళ్ల జీలుగు విత్తనాలను కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మంగళవారం నుంచి వాటిని పంపిణీ చేస్తారని చెప్పడంతో ఉదయమే రైతులంతా వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్నారు. అయితే, క్యూలో నిలబడే ఓపిక లేక అందరూ తమ వెంట తెచ్చుకున్న పట్టాదారు పాస్‌పుస్తకాలను, వారి జిరాక్స్ కాపీలను క్యూలో ఉంచి నీడలో నిలబడ్డారు. సరిపడా జీలుగ విత్తనాలు కేటాయించకపోవడంతో కొందరు రైతులు అధికారులతో వాగ్వాదానికి, ఆందోళనకు దిగారు.



కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



సాయన్నముదిరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

భూస్వాముల వ్యతిరేక పోరాట యోధుడు సాయన్న

- కృష్ణస్వామి చరిత్ర చాలా గొప్పది
- తెలంగాణ వచ్చాకే ప్రముఖుల విగ్రహాలకు గుర్తింపు
- శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

నంగునూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు పండగ సాయన్నముదిరాజ్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పండగ సాయన్న, కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాలను మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాకే ప్రముఖుల విగ్రహాలను పెట్టుకుని గుర్తుంచుకుంటున్నామని తెలిపారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడిన కృష్ణ స్వామి, పండుగ సాయన్న లాంటి మహనీయుల విగ్రహాలను హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో నలుమూలల ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కృష్ణస్వామి ముదిరాజ్ చరిత్ర చాలా గొప్పదని, ఆనాటి నిజాం కాలంలోనే గుర్తింపబడ్డారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1956 తర్వాత హైదరాబాద్ మొదటి మేయర్‌గా కృష్ణస్వామి పనిచేశారని గుర్తుచేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం వరకే కాకుండా వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలు మంజూరు చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ముదిరాజ్‌ల పట్ల చిత్తశుద్ధి ఉంటే చెరువుల్లో చేప పిల్లలు వేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, రైతుబంధు, రైతుబీమా, ఉద్యోగుల వేతనాలు చెల్లించడం లేదు. కానీ రూ.200 కోట్లు పెట్టి అందాల పోటీలు ఎవరికి అవసరమని నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మముదిరాజ్, నగేష్, సత్యం, ముదిరాజ్ సంఘం గ్రామ నాయకులు కనకరాజు, శ్రీనివాస్, లక్ష్మయ్య, రాజు, ఆంజనేయులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



కలెక్టర్ క్రాంతికి ఫిర్యాదు చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు

సదాశివపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే సోదరుడి అక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, ఆ పార్టీ మాజీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సర్వే నెంబరు 181లోని సీలింగ్ (ప్రభుత్వ) భూమిని తన సతీమణి అరుణ పేరుపై పట్టాగా మార్చుకుని అధిక ధరలకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదాశివపేట పట్టణంలో 65వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న టీఎన్జీవో భవనం ఎవరి ఆధీనంలో ఉన్నదో.. వివరాలు తెలియజేయడంతో పాటు భవనంలో కొనసాగుతున్న దుకాణాలు వాటి అద్దెలు, భవనం మున్సిపల్‌కు చెల్లించాల్సిన రూ.27 లక్షల ఆస్తిపన్నుపై విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు. సదాశివపేట పట్టణంలో గురునగర్ కాలనీలో ఎమ్మెల్యే సోదరుడు చింతా గోపాల్ మున్సిపల్ రోడ్డును ఆక్రమించి, సెట్ బ్యాక్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ భవన నిర్మాణంలోని అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ జే.ఉమాతో పాటు రెవెన్యూ, విద్యాశాఖ అధికారులను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదులోని అక్రమాలపై నిగ్గు తేల్చి, వాటి తాలూకు నివేదికలను అందజేయాలని ఆదేశించారు.

బాలిక కళా.. భళా

- కాశీ విశ్వనాథుని ప్రాంగణంలో నృత్య ప్రదర్శన



కాశీ విశ్వనాథుని సన్నిధిలో నృత్య ప్రదర్శనతో అలరించిన రక్షితగౌడ్

నర్సాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమైన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో కాశీ విశ్వనాథ ఆలయం వద్ద మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన బాలిక రక్షితగౌడ్ నృత్య ప్రదర్శన చేసి అందరినీ అలరించింది. హైదరాబాద్‌లోని భరత్ ఆర్ట్స్ అకాడమీ ట్రస్టు ఆధ్వర్యంలో కాశీకి వెళ్లిన బృందంలో నర్సాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, మాజీ మున్సిపల్ చైర్మన్ డీ.అనసూయ అశోక్‌గౌడ్ దంపతుల కూతురు రక్షితగౌడ్ కూడా ఉన్నారు. కాశీలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విశ్వనాథుని నిత్య మహోత్సవంలో భరతనాట్య సంస్కృతి కళావేదికపై కళా ప్రదర్శన చేసి అక్కడివారిని అలరించింది. దేశంలోనే పుణ్య క్షేత్రమైన కోట్లాది మంది భక్తుల ఇలవెల్పులో నర్సాపూర్ బాలిక ప్రదర్శనకు అవకాశం రావడం పట్ల ఆమె తల్లిదండ్రులు అనుసూయ,అశోక్‌గౌడ్ ఆనందానికి అవధుల్లేవు.

సిద్దిపేట జిల్లాలో కొత్తరాతియుగం ఆనవాళ్లు

- మూడు గొడ్డళ్లు, శాతవాహన కాలంనాటి టెర్రకోట బొమ్మ
- కొత్త తెలంగాణ చరిత్ర బృందం క్షేత్ర పరిశీలనలో వెలుగుచూసిన పురాతన వస్తువులు



పాటిగడ్డ పరిసరాల్లో బయటపడ్డ చారిత్రక వస్తువులు

హైదరాబాద్ సిటీ, మే26(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కొండపాక ప్రాంతం రాష్ట్రకూటుల శిల్పాలు, కాకతీయ శాసనాలు, చారిత్రక దేవాలయాలకు పెట్టింది పేరు. అదే ప్రదేశంలోని పాటిగడ్డ పరిసరాల్లో మరికొన్ని చారిత్రక వస్తువులు కొత్త తెలంగాణ చరిత్ర బృందం క్షేత్ర పరిశీలనలో వెలుగుచూశాయని ఆ సంస్థ ప్రతినిధి అహోబిలం కరుణాకర్ తెలిపారు. కొత్తరాతియుగం నాటి మూడు గొడ్డళ్లు, శాతవాహనుల కాలానికి చెందిన టెర్రకోట బొమ్మను గుర్తించినట్లు చెప్పారు. అదే ప్రదేశంలో ఇదివరకు గుప్పిళ్ల కొద్దీ రంగురంగుల గాజు పూసలు, దంతపు పాచిక, రెండు అంచుల రాతిగొడ్డలి, టెర్రకోట బొమ్మ శకలాలు, ఇనుం చిట్టాలు లాంటి మరెన్నో పురావస్తువులు లభించాయి. తెలంగాణ హెరిటేజ్ శాఖ కొండపాక పాటిగడ్డలో ప్రత్యేక శోధన నిర్వహించాలని, తద్వారా విలువైన చారిత్రక సంపదను కాపాడాలని కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ కోరారు.

'ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి'

గజ్వేల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి... మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. మావోయిస్టుల నిర్మూలన పేరుతో చేపడుతున్న చర్యల వల్ల అడవుల సమీపంలో ఉన్న అమాయకపు ఆదివాసి ప్రజలు చంపబడుతున్నారన్నారు. అడవుల్లో ఉన్న సహజ సిద్ధమైన వనరులను బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడం కోసం చేపడుతున్న చర్య అని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నావని పేర్కొన్నారు. పెద్దఎత్తున పోలీస్ బలగాలను అడవుల్లోకి పంపి మారణహోమానికి పాల్పడుతున్నారని చెప్పారు.

'గీతం'లో ఎన్‌సీసీ క్యాంపు

పటాన్‌చెరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని 33 (తెలంగాణ) బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం సంయుక్త వార్షిక శిక్షణా శిబిరం (సీఏటీసీ-3) మే 26 నుంచి జూ 4 వరకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (రుద్రారం) ప్రాంగణంలో నిర్వహించనున్నారు. పదిరోజుల పాటు శిబిరం నిర్వహించనున్నారు. క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తిని పెంపొందించడం, క్రమశిక్షణ, సహకారం, వ్యక్తిత్వ నిర్మాణాలను ప్రోత్సహించడం, సామాజిక సేవ, జాతీయ ఐక్యత స్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. కల్నల్ రమేష్ నేతృత్వంలో నిర్వహించే ఈ క్యాంపులో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ అకౌంట్స్ అధికారిగా కెప్టెన్ పి.విజయ, క్యాంప్ శిక్షణ అధికారిగా లెఫ్టినెంట్ ఆర్.మహేందర్ రెడ్డి, క్యాంప్ అడ్జటెంట్‌గా లెఫ్టినెంట్ యాదగిరి వ్యవహరించనున్నారు. గీతం తరపున ఎన్‌సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ పాల్గొననున్నారు.

న్యూస్ బాక్స్

బొలేరో వాహనం పట్టివేత

కోహెడ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా బొలేరో వాహనంలో ఇసుక తరలిస్తుండగా సోమవారం కోహెడ పోలీసులు పట్టుకున్నారు. టీజీ 36-టి-0634 గల వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఇసుక లోడ్‌తో ఉన్న బొలేరో వాహనాన్ని పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు.

సీజ్ చేసిన ఇసుక వేలం..

ధూళిమిట్ట, మే26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన దాదాపు 200 ట్రాక్టర్ల సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 31వ తేదీన శనివారం రోజు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు తహశీల్దార్ మధుసూధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.5,000 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూళిమిట్ట విద్యార్థి



సందీప్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి

ధూళిమిట్ట,మే26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన సుందరగిరి సందీప్ అనే విద్యార్థి 43వ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు చండీఘర్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలలో సందీప్ పాల్గొంటాడని తెలిపారు. సందీప్‌కు స్పోర్ట్స్ డ్రెస్‌తో పాటు రూ.1000 నగదును ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి బహుమతిగా అందించి అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మర్కుక్, మే 26 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ గ్రామానికి చెందిన ఎరుకలి రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందగా స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న రెడ్డి బ్రదర్స్ సాయిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియన్ నాయకులు సాయిరెడ్డి రాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వారి తండ్రి జ్ఞాపకార్థంగా సాయిరెడ్డి పోషంరెడ్డి పేరుమీద 10వేల రూపాయలు ఆర్థికసాయం అందించారు.

సాదిత్‌అలీకి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దర్మాజీపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సాదీత్ అలీ

దుబ్బాక, మే26(ఆంధ్రజ్యోతి): విద్యా సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించందుకు డిల్లీలోని ఎమర్జింగ్ అచీవర్స్ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాక మున్సిపల్ దర్మాజీపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సాదీత్ అలీకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. భౌతిక, రసాయన శాస్త్రంలో నోకాస్టు ద్వారా 20 ఏళ్లనుంచి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. సౌతిండియా సైన్స్ పేయిర్‌లో ప్రథమ బహుమతి పొందారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా చిక్కుడు చంద్రం ముదిరాజ్



చిక్కుడు చంద్రం ముదిరాజ్

తొగుట, మే 26(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ తొగుట మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా చిక్కుడు చంద్రంముదిరాజ్, ప్రధాన కార్యదర్శుడిగా తోలుకంటి రాజు, వర్ధపల్లి నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా బెజగామ ఆంజనేయులు, నంట స్వామిరెడ్డి, ముడికె స్వామి, చిక్కుడు లింగం, కార్యదర్శులుగా నూనె అంజనేయులు, గూళ్ల రాజు, కోశాధికారిగా బోయిని మురళి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, పర్శరాములు, ప్రశాంత్‌గౌడ్, అనిల్, ప్రవీణ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బైరిశంకర్ మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహపునః ప్రతిష్ఠ

కుకునూరుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ ఎల్లమ్మతల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ దేవాలయ పునఃనిర్మాణం కార్యక్రమం ప్రారంభమైంది. ఆదివారం ధ్వజారోహణంతో మొదలు కాగా శుక్రవారం ఉత్సవాలు ముగియనున్నాయి. విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి భారీ ఎత్తున గౌడ సంఘం ఏర్పాట్లు చేసింది.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు

● గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు ● పోలీసుల పర్యవేక్షణ కరువు



అక్కన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయల ఖర్చుతో అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నేరాల నియంత్రణ కోసం పోలీసు యంత్రాంగం ఎంతో ప్రతిష్మాత్మకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక నిద్రపోతుండంతో అవి అలంకారప్రాయంగా మిగిలాయి. అక్కన్నపేట మండలంలోని 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పలు గ్రామల్లో దాతల ఆర్థిక సహాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా వాటిని పర్యవేక్షణ చేయడంలో పోలీసులు విఫలం చెందుతున్నారు. కనీసం గ్రామపంచాయతీ కార్యదర్శి అయినా సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత తీసుకోవాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరిగిన సందర్భాల్లో సీసీ కెమెరాల ద్వారా పలువురు నేరస్థులను గుర్తించి అదుపులోకి తీసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కానీ ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరస్థులను పట్టుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఇటివల మండలంలోని రామవరం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లకు ఏర్పాటు చేసిన సౌండ్ బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లలో పోసిన డీజిల్‌ను దొంగతనం చేయడంతో వారిని పట్టుకునేందుకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరాల పుటేజీను పరిశీలించగా అవి పని చేయలేదు. దీంతో గ్రామస్థులు సీసీ కెమెరాల ఏర్పాటుకు డబ్బులు వసూలు చేసి అవి పనిచేస్తున్నాయో లేదో చూడవలసిన బాధ్యత ఎవరిది అని గ్రామపంచాయతీ అధికారులను నిలదీసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, పోలీసులు ప్రత్యేక చొరవ చూపి పనిచేయని సీసీ కెమెరాలను తక్షణమే ఉపయోగంలోకి తీసుకు వస్తే బాగుంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై అక్కన్నపేట ఎస్సై విజయ్‌భాస్కర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



అక్కన్నపేట మండలం రామవరంలో పనిచేయని సీసీ కెమెరాలు

ప్రభుత్వం మీదేగా.. విచారణ జరిపించండి

- దరఖాస్తు ఇస్తే తప్పకుండా స్పందిస్తా
- చెరుకూ.. తప్పుడు ప్రచారాలు మానుకో

దుబ్బాక, మే26 (ఆంధ్రజ్యోతి): ప్రజాజీవితంలో ఉన్నావు.. ముఖ్యంగా అధికార పార్టీలో ఉండి, చిన్నపిల్లల చేష్టలు ఇంకా మార్చుకోవా..? ప్రభుత్వం మీదేగా.. విచారణ జరిపించండని' దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకుశ్రీనివాస్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బక్కివెంకటయ్య మండిపడ్డారు. నీతో చేతకాకపోతే, నాకు దరఖాస్తు తెప్పించి ఇవ్వు... విచారణకు ఆదేశిస్తానని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన దుబ్బాక విలేఖరులకు పంపిన ప్రెస్‌నోట్‌లో చెరుకు శ్రీనివాస్‌రెడ్డిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు తాను నేరుగా గాని, వాట్సప్‌లో గానీ లేదంటే రైతుల పరంగా గానీ తనకు వినతిపత్రం పంపిస్తే, చర్యలు తీసుకుంటానన్నారు. తాను చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి పోటీకాదనీ, తనను లక్ష్యంగా విమర్శలు బాధకలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, చౌదర్‌పల్లి భూములపై విచారణ జరిపించే బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి కలిసి తప్పుడు జీవోలు సృష్టించామని తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి తప్పుడు పనులు చేసేందుకు తాను, ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి దిగజారలేదని, తాము నిజాయితీగానే రాజకీయాలు చేస్తామన్నారు. ఈభూముల వ్యవహారంలో తమ పాత్ర ఉన్నట్లు నిరూపించకుంటే, వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డికి పేరుందని, ఆయన లాంటి హుందాకరమైన రాజకీయాలు చేసినప్పుడే శిష్యుడిగా నాకు, కుమారుడిగా నీకు ప్రజల్లో గౌరవం దక్కుతుందన్నారు. చిల్లర విమర్శలు , తప్పుడు ప్రచారాలు శ్రీనివాస్‌రెడ్డి మానుకోవాలని బక్కి వెంకటయ్య హితువు పలికారు.

నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మద్దూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : నేడు మద్దూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉందని తహసీల్దారు ఎజీ రహీం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 21 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతున్నారని లబ్ధిదారులు హాజరు కావాలని సూచించారు.

గజ్వేల్‌లో ఘనంగా నేషనల్ పైలట్స్ డే



పైలట్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న 108 సిబ్బంది

గజ్వేల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ పైలట్స్ డే సందర్భంగా 108 అంబులెన్స్ వాహన పైలట్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జాన్ షాహీద్ పాల్గొని, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో క్షణాల్లో స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడడంలో 108 పైలట్ల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం గుడిసె తొలగించి..



తాత్కాలికంగా టార్పాలిన్ కవర్లతో ఏర్పాటు చేసుకున్న గుడిసె

రాయపోల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి కోసం తాను ఉంటున్న పూరిగుడిసెను తొలగించిన ఓ మహిళ తన పిల్లలతో కలిసి తాత్కాలికంగా టార్పాలిన్ కవర్లతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలో ఇబ్బందిపడుతూ నివసిస్తున్నది. వివరాల్లోకి వెలితే రాయపోల్ మండలం ముంగీస్‌పల్లిలో ఇటీవల నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన రామొల్ల సుజాత పేరు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లిస్టులో ఉంది. ఇటీవల అధికారులు వెరిఫికేషన్ కోసం ఆమె ఇంటికి వచ్చి వివరాలు సేకరించారు. దీంతో తన ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తారేమోనన్న ఆశతో తాను నివాసముంటున్న పూరి గుడిసెను తొలగించి భూమిని చదును చేసుకున్నది. తన స్థలం పక్కన టార్పాలిన్ కవర్లతో ఓ తాత్కాలికంగా గుడిసె ఏర్పాటు చేసుకుని అందులో నివాసం ఉంటున్నది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలోకి నీళ్ల రావడంతో పాములు, తేళ్ల వస్తాయేమోనని భయంతో జీవనం కొనసాగిస్తుంది. తన ఇంటి నిర్మాణానికి అధికారులు వెంటనే ముగ్గు పోయాలని కోరుతుంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శశిని అడుగగా రామొల్ల సుజాతకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, శాంక్షన్ లెటర్ రాగానే నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తామని పేర్కొన్నారు.

మల్లన్న ఆలయాభివృద్ధిలో దాతల ఔదార్యం ఎనలేనిది

చేర్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయాభివృద్ధిలో దాతల ఔదార్యం ఎనలేనిదని ఆలయ ఈవో అన్నపూర్ణ అన్నారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన చిర్రబోయిన బద్రీనాథ్ యాదవ్ మల్లన్న ఆలయ పరిధిలో రూ.15లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అతిథిగృహాన్ని సోమవారం ఆలయ ఈవో అన్నపూర్ణ సమక్షంలో అప్పగించారు. ఆమె మాట్లాడుతూ ఆలయంలో మౌలికవసతుల కల్పనకు దాతల సహకారం కీలకమన్నారు. భక్తులకు బస కల్పించేందుకు డోనార్ స్కీం ద్వారా 100గదుల సత్రభవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు.

గజ్వేల్ ఏసీపీగా కె. నర్సింలు బాధ్యతల స్వీకరణ

గజ్వేల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఏసీపీగా కె. నర్సింలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గజ్వేల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ ఆయనకు అభినందనలు తెలిపి, గజ్వేల్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, గంజాయి, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని సూచించారు. గజ్వేల్ ఏసీపీగా పనిచేసిన పురుషోత్తంరెడ్డి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీగా పనిచేస్తున్న నర్సింలు గజ్వేల్ ఏసీపీగా బదిలీపై వచ్చారు.

ఏసీపీకి ఘనంగా వీడ్కోలు

గజ్వేల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఏసీపీగా బదిలీపై వెళ్లిన కె. పురుషోత్తంరెడ్డికి గజ్వేల్ డివిజన్‌పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. గజ్వేల్ ఏసీపీగా 14నెలలు పనిచేసిన పురుషోత్తంరెడ్డితో కలసి తాము పనిచేసిన అనుభవాలను, తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనపై పూలు చల్లుతూ కారు వరకు వెళ్లి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ బి. సైదా, ట్రాఫిక్ సీఐ మురళీ, సబ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది తదితరులున్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి



మల్లంపల్లిలో మాట్లాడుతున్న జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

అక్కన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, చౌటపల్లి, కేశవాపూర్, మోత్కులపల్లి గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల విచక్షణ రహితంగా అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నేటితరం యువత డ్రగ్స్, బెట్టింగ్ లాంటి వాటికి దూరంగా ఉండి క్రమశిక్షణగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ గాయని స్వర్గీయ బెల్లి లలితక్క వర్ధంతి

తెలంగాణ గాయని స్వర్గీయ బెల్లి లలితక్క 26వ వర్ధంతిని మండలంలోని మల్లంపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ 1999లో అప్పటి ఆంధ్ర పాలకులు బెల్లి లలితక్కను 17 ముక్కలుగా నరికి చంపారని పేర్కొన్నారు. లలితక్క పోరాట స్ఫూర్తితో డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్ నివారణకు పోరాటాలు చేయాలని కోరారు.

వర్షాకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

హుస్నాబాద్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు ముందస్తుగా అందుబాటులో పెట్టాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజక వర్గ అధికార ప్రతినిధులు మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి సోమవారం వ్యవసాయ డివిజనల్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ మాట్లాడుతూ హుస్నాబాద్ డివిజన్‌లో ముందస్తుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. రైతుల అవసరాలను గుర్తించి ఖరీఫ్ సాగుకు సరిపడే విధంగా సాగు అంచనాలు తయారు చేసి విత్తనాలు , ఎరువులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. హుస్నాబాద్‌లో నకిలీ,ఎరువులు విత్తనాలు అమ్మే దుకాణదారుల లైసెన్స్‌లు రద్దు చేసి రైతులు మోసపోకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని వినతి పత్రంలో కోరారు.

కార్మికసంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

చేర్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణకార్మిక సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి తరలివెళ్లకుండా కొమురవెల్లి మండల సంఘం నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు

గజ్వేల్/చేర్యాల/తొగుట/మద్దూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను పలువురు అధికారులు తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని యజమానులకు సూచించారు.

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపండి

మద్దూరు/అక్కన్నపేట/మర్కుక్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలతో అత్యుత్తమ ఉపాధ్యాయులతో ఉన్నత ప్రమాణాలతో బోధించే ఉపాధ్యాయులు ఉన్నారని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కొన్ని మండలాలలో తిరుగుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో రెండు ఏకరూప దుస్తులతో పాటు ఒక స్పోర్ట్స్ యూనిఫామ్ ఉచితంగా నోటు పుస్తకాలు మధ్యాహ్న భోజన పథకం, వారికి మూడు కోడిగుడ్లతో పాటు వారంలో మూడు రోజుల పాటు పౌష్టికాహారాన్ని రాగిజావను అందించనున్నట్లు, ప్రభుత్వ పాఠశాలలో ఆధునాతన సదుపాయాలు ఉన్నాయన్నారు.

ఇంటింటికీ అమృత్ 2.0

(5వ పేజీ తరువాయి..)

అపార్ట్‌మెంట్లు, విల్లాలు, పెద్దపెద్ద భవనాలను భారీగానే నిర్మించారు. సిద్దిపేట పట్టణంలో ప్రతిరోజూ 25.25 ఎంఎల్‌డీ (మిలయన్ లీటర్లు పర్ డే) అందిస్తుండగా, గజ్వేల్‌లో 7.25 ఎంఎల్‌డీ అవసరముండగా 6.8 ఎంఎల్‌డీ తాగునీరును, చేర్యాలలో 2.75 ఎంఎల్‌డీ అవసరముండగా 1.75 ఎంఎల్‌డీ నీరును మిషన్ భగీరథ ద్వారా, 1 ఎంఎల్‌డీని పట్టణంలో మున్సిపల్ వార్డుల్లో వేసిన బోర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి

చేర్యాల, మే 26(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించి సన్మార్గంలో పయనించాలని హుస్నాబాద్ షీ టీం బృందం సభ్యులు సూచించారు. చేర్యాల పట్టణంలోని సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలు తదితర అంశాలపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పట్టు ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానం

జగదేవ్‌పూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పట్టు ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాలలో ఉద్యానవన పంటలను పరిశీలించిన అనంతరం రైతులకు ఉద్యానవన పంటల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 403 కుటుంబాలు మల్బరీ సాగు చేపట్టి నెలకు 50వేల నుండి లక్ష రూపాయల వరకు ఆదాయం పొందుతున్నట్లు వివరించారు. 2014 కంటే ముందు జిల్లాలో 30 ఎకరాలు మాత్రమే మల్బరీ సాగు ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత జిల్లాలో ప్రస్తుతం 1127 ఎకరాల్లో మల్బరీ తోటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పట్టు పరిశ్రమ చేనేత రంగానికి వెన్నుముక లాంటిదని తెలిపారు. ఒక ఎకరం వరి సాగు చేసే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు మల్బరీ సాగు చేయవచ్చని రైతులకు సూచించారు.

పట్టాదారుపాస్ బుక్కులు ఇప్పించాలని వినతి



ఆర్డీవో రామ్మూర్తికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అక్కన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కట్కూరు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన భూములకు పట్టాపాస్ బుక్కులు ఇప్పించాలని సోమవారం హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 1996లో భూమిలేని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం భూములను కేటాయించిందని, అట్టి భూములను 26 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని, ఆ భూములకు పట్టాపాస్‌బుక్కులు ఇప్పించాలని వారు కోరారు. ఇందులో ఒపీడీఆర్ జిల్లా కార్యదర్శి జయరాములు, తదితరులు ఉన్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు

చేర్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): దళితబంధు పథకానికి సంబంధించి పలువురు తమపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని కొమురవెల్లి ఎంపీపీ తలారికీర్తన భర్త తలారి కిషన్ అన్నారు. సోమవారం కొమురవెల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ వద్ద కారుడ్రైవర్‌గా పనిచేసిన సుంచు సురేశ్ లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన దాసరి హరిబాబు, దాసరి పర్శరాములు నుంచి దళితబంధు పేరిట డబ్బులు తీసుకున్నది వాస్తవమన్నారు. కానీ విషయం తెలియడంతోనే కొమురవెల్లి మండల ప్రజాప్రతినిధులు, పలువురు పెద్దల సమక్షంలో సుంచు సురేశ్‌ను విచారించడంతో మాప్రమేయమేమీ లేదని తెలిపారన్నారు. ఈవిషయ మై తామే పోలీసులకు ఫిర్యాదు చేశామని, కానీ పలువురు మాపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తుండటం సబబుకాదన్నారు.

ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం



ముదిరాజ్ సంఘం నాయకులకు చెక్కును అందిస్తున్న కరుణాకర్‌రెడ్డి

మర్కుక్, మే 26 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం ఎర్రవల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మర్కుక్ మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి సోమవారం లక్ష రూపాయలు విరాళాన్ని ముదిరాజ్ సంఘం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయాన్ని నిర్మిస్తున్న ముదిరాజ్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్, మహేష్, ముదిరాజ్ సంఘం నాయకులు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫార్మా ఐడీని సద్వినియోగం చేసుకోవాలి

కోహెడ, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ఈ ఫార్మా ఐడీనీ ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం కోహెడ మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో ఫార్మా ఐడీ రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతులు నమోదు చేసుకున్న ఈ ఫార్మా ఐడీలో రైతులకు సంబంధించిన కేంద్ర పథకాలైన పీఎం కిసాన్ నిధి, ఎసల్ భీమా, సాయిల్ హెల్త్‌కార్డుకు ఈ ఐడీ తప్పనిసరి అవసరమన్నారు. ఈ ఫార్మారైతులకు ప్రత్యేక ఐడీ కార్డు నంబర్ వస్తుందని దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో కోరారు.

మత్స్యకారులకు సబ్సిడీ చేపపిల్లలు పంపిణీ చేయాలి

● హుస్నాబాద్ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించే చేపపిల్లలను మత్స్యకారులకు జూన్, జూలైలోనే పంపిణీ చేయాలని హుస్నాబాద్ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం శ్రీనివాస్ హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 2016లో అప్పటి ప్రభుత్వం 100శాతం సబ్సిడీతో ఉచిత చేపపిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. అయినా ఏనాడు కూడా చేపపిల్లలు పంపిణీ చేసే కాంట్రాక్టర్లు సకాలంలో మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేయలేదన్నారు. దీంతో మత్సకారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జూన్, జూలైలో ప్రభుత్వం అందించే చేపపిల్లలను పంపిణీ చేస్తే వాటిని చెరువులు, కుంటల్లో వదిలిపెట్టడంతో చేపలు ఎదిగి ధర వస్తుందన్నారు. ఆగస్టు తర్వాత చేపల పంపిణీ చేయడంతో చేపలు ఎదుగుదల లేక మత్స్యకారులు నష్టపోతున్నారని ప్రభుత్వం ముందస్తుగా చేపలు పంపిణీ చేసే కాంట్రాక్టర్ల ద్వారా ముందస్తు టెండర్లు పూర్తి చేసి సకాలంలో మత్స్యకార్మికులకు ఉచిత చేపలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని శ్రీనివాస్ కోరారు.

ఈ సంవత్సరం నుంచే కస్తూర్బాలో ఇంటర్..



మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల భవనం

మర్కుక్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం నుంచి మర్కుక్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి వెంకట్రాములు తెలిపారు. ఇదివరకు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరు నుంచి పదవ తరగతి వరకు మాత్రమే ఉండేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బాగాంధీ పాఠశాలలకు ఇంటర్మీడియట్ కూడా నడిపించాలని అందులో భాగంగానే మర్కుక్ మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలలకు కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నడిపించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

మద్దూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిళ్లాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను ఎత్తుకెళ్లిన ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఈ విషయమై ఎస్సై మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు విద్యుత్ ఏఈ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.